క్లుప్తంగా

బాధితుడికి పరామర్శ

కడ్తాల్: మండల పరిధిలోని మక్తమాధారం గ్రామానికి చెందిన జగన్ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడిని గురువారం ఉదయం డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

కిషన్‌రెడ్డిని కలిసిన గిరిజన మోర్చా నాయకులు

కడ్తాల్: బీజేపీ రాష్ట్రశాఖ అధ్యక్షుడిగా నియమితులైన గంగాపురం కిషన్‌రెడ్డిని రాష్ట్ర గిరిజన మోర్చా కార్యవర్గ సభ్యుడు శంకర్‌నాయక్, రాష్ట్ర గిరిజన మోర్చా ప్రచార కమిటీ కోకన్వీనర్ రెడ్యానాయక్ గురువారం హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో కలిశారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఆపార్టీ నాయకులు సాయిలాల్‌నాయక్, లక్ష్మన్ నాయక్, మండల ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

పరికిషన్‌రెడ్డికి పరామర్శ

యాచారం: బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, తాడిపర్తి మాజీ సర్పంచ్ పరికిషన్‌రెడ్డిని గురువారం ఆ పార్టీ రాష్ట్ర నేత క్యామ మల్లేశ్ పరామర్శించారు. పరికిషన్‌రెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. సమాచారం తెలుసుకున్న క్యామ మల్లేశ్ తాడిపర్తి గ్రామంలోని ఆయన ఇంటికెళ్లి పరికిషన్‌రెడ్డిని పరామర్శించారు. బీఏన్ఆర్ ట్రస్టు చైర్మన్ బిలకంటి శేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు జంగమ్మ, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి భాషా, మాజీ సర్పంచ్ వెంకటమ్మ, శశికళ, మల్లేష్, పాండు ఉన్నారు.

ఎల్‌ఓసీ చెక్కు అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని వీరన్నపల్లికి చెందిన జంగమ్మ అనారోగ్యానికి గురై హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. స్థానిక నేతల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఆమె వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధికి దరఖాస్తు చేయగా.. మంజూరైన రూ.2లక్షల50వేల ఎల్‌ఓసీ చెక్కును గురువారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. సర్పంచ్ నాగమణి, లింగంగౌడ్, భీమయ్య, సాయిరెడ్డి, మల్లయ్య, రవి, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరాహార దీక్ష

తలకొండపల్లి: మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో వివిధ పార్టీల నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారానికి 4వ రోజుకు చేరుకున్నాయి. అభివృద్ధి పరంగా గ్రామం ముందంజలో ఉన్నా మండలం ఎందుకు ఏర్పాటు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే అభివృద్ధి: సామ

వనస్థలిపురం: కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తేనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా ఆయన గురువారం వనస్థలిపురం డివిజన్‌లోని యశోధర కాలనీ, శ్రీకృష్ణానగర్ కాలనీ, ఓంకార్‌నగర్, శక్తినగర్ కాలనీలలో పాదయాత్ర చేస్తూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. యశోధర కాలనీలో డ్రైనేజీ, వరద, మంచినీటి సమస్యలు ఉన్నాయని, స్థానిక ఎమ్మెల్యేకు ప్రజల క్షేమం పట్టడం లేదన్నారు. కనీస వసతులు కల్పించని బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని కోరారు. కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు నూతి శ్రీనివాస్, నాయకులు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, అంజన్‌కుమార్, వాసు చౌదరి, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌బీనగర్ సర్కిల్ డీసీ సురేందర్‌రెడ్డి బదిలీ

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ సర్కిల్-4 డీసీ సురేందర్‌రెడ్డి నార్సింగ్ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. అక్కడ పనిచేస్తున్న కమిషనర్ సత్యబాబును గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ చేశారు. ఈ మేరకు మున్సిపల్ అడ్మిస్ట్రేషన్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అర్వింద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. సురేందర్‌రెడ్డి శుక్రవారం నార్సింగ్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది. కాగా, బదిలీ నేపథ్యంలో సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ, రెండున్నరేళ్లపాటు ఎల్‌బీనగర్ సర్కిల్ డీసీగా పని చేశానని, అందరి సహకారంతో సర్కిల్‌లోని అన్ని డివిజన్లను అభివృద్ధి చేశామని అన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేశానన్నారు. విధి నిర్వహణలో తనకు సహకరించిన అధికారులకు, సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రక్తదాన శిబిరం

ఎల్‌బీనగర్: దాతలు అందించే ప్రతీ రక్తపు చుక్క ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారి నిండు ప్రాణానికి భరోసాగా నిలుస్తుందని జీబీ ఇన్‌ఫ్రా గ్రూప్ మార్కెటింగ్ డైరెక్టర్ అనిల్‌రెడ్డి అన్నారు. గురువారం బీఎన్‌రెడ్డి కాలనీ సంక్షేమ సంఘ భవనంలో జీబీ ఇన్‌ఫ్రా గ్రూప్ మార్కెటింగ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా దాతల నుంచి 150 యూనిట్ల రక్తాన్ని సేకరించి చిరంజీవి రక్తనిధికి అందజేశారు. యువత రక్తదానం చేయాలన్నారు. మార్కెటింగ్ సభ్యులు కోటేశ్వరరెడ్డి, లింగయ్య, నీలకంఠం, సురేందర్, యాదయ్య, ప్రవీణ్‌గౌడ్, నాగచందర్, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా 'మోడల్' నిర్మాణం

- కొంగర కలాన్ వద్ద రూ.1.5 కోట్లతో మార్కెట్ నిర్మాణం
- మాంసం, కూరగాయలు, పండ్ల విక్రయాలన్నీ ఇక్కడే
- రెండు నెలల్లో అందుబాటులోకి తెస్తామంటున్న కమిషనర్



ఆదిబట్లలో నిర్మిస్తున్న మోడల్ మార్కెట్

ఇబ్రహీంపట్నం రూరల్: పుర ప్రజలకు అన్ని వస్తువులు ఒకేచోట దొరికేలా ప్రభుత్వం మోడల్ మార్కెట్లను నిర్మిస్తోంది. అందులో భాగంగానే ఆదిబట్ల మున్సిపాలిటీ కేంద్రం కొంగరకలాన్‌కు వెళ్లే దారిలో సర్వే నంబర్ 442లో సమీకృత మోడల్ మార్కెట్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం రెండు ఎకరాల స్థలం కేటాయించిన విషయం తెలిసిందే. రూ.1.5 కోట్లతో ఈ భవన సముదాయాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే 70 శాతం మేర పనులు పూర్తిచేశారు. మాంసం, కూరగాయాలు ఒకేచోట అమ్ముకునే వెసులుబాటు కల్పించారు. ఇక్కడే పండ్లు, పూలను కూడా విక్రయించేందుకు నిర్మాణాలు చేపడుతున్నారు. కూరగాయల దుకాణాలకు 14, మాసం దుకాణాలకు 14 షటర్ల చొప్పున కేటాయించారు. భవన సముదాయం మధ్యలో ఖాళీ స్థలంలో పూలు, పండ్లు అమ్ముకోవడానికి తాత్కాలిక నిర్మాణాలు చేపడతారు. మరో రెండు నెలల్లో ఈ మార్కెట్ ప్రజలకు అందుబాటులోకి రానుంది.

200 మందికి ఉపాధి...

ఆదిబట్ల మున్సిపాలిటీలో మోడల్ మార్కెట్ నిర్మాణం పూర్తయితే ప్రత్యక్షంగా, పరోక్షంగా 200కు పైగా ప్రజలకు ఉపాధి లభిస్తుంది. ఇదే కాకుండా పక్క ప్రాంతాల నుంచి వచ్చేవారికి ఉపాధి లభిస్తుంది. మున్సిపాలిటీ అధికారులు ప్రత్యేక చొరవతో నిర్మాణం చేపడుతున్నారు. ప్రజారోగ్య శాఖ తరుపున పనులు చేపడుతున్నారు. ప్రభుత్వం అందించే ప్రత్యేక నిధులతో మార్కెట్ నిర్మాణం పనులు చకచకా సాగుతున్నాయి. నాణ్యతో కూడిన పనులు చేయాలని అధికారులు కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

త్వరలో పూర్తిచేస్తాం



మున్సిపల్ ప్రజలకు మౌలిక వసతులు కల్పించడానికి కృషి చేస్తున్నాం. పట్టణ కేంద్రాల్లో వెజ్-నాన్‌వెజ్ దుకాణాలు ఉండటంతో దుర్గంధం వెదజల్లుతోంది. అందుకే పట్టణానికి కొద్ది దూరంలో మోడల్ మార్కెట్ నిర్మాణం చేపడుతున్నాం. త్వరలో భవన నిర్మాణం పూర్తిచేస్తాం. ప్రభుత్వ నిబంధలన మేరకు సముదాయాలు కేటాయింపు జరుగుతుంది.

– అమరేందర్‌రెడ్డి, కమిషనర్, ఆదిబట్ల

కులవృత్తులకు ప్రభుత్వం పెద్దపీట



కుమ్మరుల బోనాల ఉత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: బోనాల ఉత్సవం తెలంగాణ పండుగని.. కుమ్మర సంఘం ఆధ్వర్యంలో తొలి బోనం సమర్పించడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని కుమ్మర సంఘం ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం కట్టమైసమ్మ తల్లికి గురువారం తొలి బోనం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్నివర్గాల సంక్షేమంతోపాటు కులవృత్తులకు బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ఈ సందర్భంగా ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకటరమణారెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, మాజీ ఎంపీపీ నిరంజన్‌రెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, యాచారం ఎంపీపీ సుకన్య, సబ్‌రిజిస్ట్రార్ మధుబాబు, కుమ్మర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జయంత్‌రావు, ప్రధాన కార్యదర్శి దయానంద్, ఆ సంఘం నాయకులు గణేశ్, పాండు, నాగరాజు, కృష్ణ, మల్లేష్ పాల్గొన్నారు. కాగా ఈ ఉత్సవాల్లో పాల్గొన్న బీజేపీ, కాంగ్రెస్ నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు.

సర్వ్ సంస్థ సేవలు అభినందనీయం

ఎంపీపీ కమ్లీమోత్యానాయక్



దివ్యాంగులకు బస్‌పాస్‌లు అందజేస్తున్న ఎంపీపీ, అతిథులు

కడ్తాల్: దివ్యాంగుల పునరావాసం వారి సంక్షేమాభివృద్ధికి సర్వ్ సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ అన్నారు. గురువారం మండల పరిధిలోని మైసిగండి గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో సర్వ్ సంస్థ, ఆర్టీసీ అధికారులతో కలిసి దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్‌ల పంపిణీ, అదే విధంగా కామినేని ఆస్పత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ ముఖ్య అతిథిగా హాజరై ఆయా కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. దివ్యాంగులకు అవసరమైన విద్యా, వైద్య, ఆర్థిక, సామాజిక అవసరాలను గుర్తించి వారి సంక్షేమం కోసం సర్వ్ సంస్థ కృషి చేయడం అభినందనీయమని అన్నారు. దివ్యాంగుల సంక్షేమానికి కృషిచేస్తున్న సర్వ్ సంస్థకు తమవంతు సహాయం అందిస్తామని తెలిపారు. అనంతరం దివ్యాంగులకు బస్‌పాసులు అందజేయడంతో పాటు, కామినేని ఆస్పత్రి వైద్యులు 210 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తులసీరాంనాయక్, సంస్థ డైరెక్టర్ అనిల్‌కుమార్, సంస్థ అధ్యక్షురాలు మీనాక్షి, క్యాంపు ఇన్‌చార్జి శ్రీధర్, సర్వ్ సంస్థ సిబ్బంది శ్రీనివాస్, శివ, ఆర్టీసీ బస్‌పాసుల ఇన్‌చార్జి శ్రీరాములు, వైద్య సిబ్బంది, దివ్యాంగులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జగదీశ్



తలకొండపల్లి: ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సమ్మెచేస్తున్న కార్మికులు



ఇబ్రహీంపట్నం: కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న సీఐటీయూ నేత జగదీశ్

ఇబ్రహీంపట్నం: గ్రామ పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జగదీశ్ డిమాండ్ చేశారు. కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో గురువారం ఇబ్రహీంపట్నంలో గ్రామ పంచాయతీ సిబ్బంది నిర్వహించిన స్మెమ్మెలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ ఉద్యోగులను, సిబ్బందిని పర్మినెంట్ చేసి పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలన్నారు. ప్రమాదంలో మరణించిన కార్మికుడి కుటుంబానికి రూ.పదిలక్షల నష్టపరిహారం చెల్లించాలన్నారు. మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దుచేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా కల్పించాలన్నారు. ఎనిమిది గంటల పనిదినాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు బుగ్గరాములు, ఎల్లేష్, దేవదాసు,నరేష్, బాలప్ప, సత్తిరెడ్డి, సత్యనారాయణ, సువర్ణ, పోచమ్మ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం ఇవ్వాలి..

తలకొండపల్లి: పంచాయతీ కార్మికులకు కనీసం రూ.19,000 వేతనం ఇవ్వాలని సీఐటీయూ మండల కన్వీనర్ గుమ్మడి కురుమయ్య డిమాండ్ చేశారు. సమస్యల సాధన కోసం కురుమయ్య ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు గురువారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కురుమయ్య మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి పనిచేస్తున్న పంచాయతీ కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని, జీఓ నెంబర్ 51ని సవరించి మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయడంతో పాటు పాత కేటగిరి విధానాన్ని అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ, రూ.10లక్షల ప్రమాదబీమా కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికుల అధ్యక్షురాలు యాదమ్మ, కోకన్వీనర్ రవళి, సభ్యులు యాదమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించండి

యాచారం: తమను పర్మినెంట్ చేయాలంటూ పంచాయతీ కార్మికులు గురువారం యాచారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష నిర్వహించారు. తమను పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. పంచాయతీ సిబ్బందికి మద్దతుగా గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మిక యూనియన్, సీఐటీయూ నాయకులు గ్యార పాండు, పెండ్యాల బ్రహ్మయ్య, చందునాయక్ నిలిచారు. ప్రభుత్వం తమ డిమాండ్లు పరిష్కరించేవరకు వరకు సమ్మె కొనసాగిస్తామని పంచాయతీ సిబ్బంది స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాషయ్య, వినోద్‌కుమార్, గణేష్, భూషన్, బుగ్గరాములు, పాండుచారి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి..

మంచాల: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని జేఏసీ జిల్లా చైర్మన్ పాండు, సీఐటీయూ మండల కన్వీనర్ కృష్ణ డిమాండ్ చేశారు. గురువారం మంచాల మండల కార్యాలయం వద్ద జేఏసీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్త సమ్మెలో భాగంగా ధర్నా చేశారు. కార్యక్రమంలో తెలంగాణ గ్రామ పంచాయతీ యూనియన్ మండల అధ్యక్షుడు ఖాజాపాషా, ప్రధాన కార్యదర్శి భాస్కర్, నాయకులు మాధవి, రవి, జంగయ్య, శంకరయ్య, సురేష్, కృష్ణ, అర్జున్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

హయత్‌నగర్‌లో..

హయత్‌నగర్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ... గురువారం హయత్‌నగర్‌లో సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ ఆధ్వర్యంలో కార్మికులు ఆందోళన చేపట్టారు. కనీసవేతనాలు అములుచేయాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ,పీఎఫ్, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా నాయకులు నర్సింహ, కిషన్, బోడ సామిల్, రవికుమార్, బూర ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు అండగా లయన్స్‌క్లబ్

- క్లబ్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లుగౌడ్
- జేఈఈ అడ్వాన్స్ ర్యాంకర్లను సన్మానించిన సభ్యులు



చిద్విలాస్‌రెడ్డి, బాలరాజుగౌడ్‌ను సత్కరిస్తున్న సభ్యులు

ఆమనగల్లు: నిరుపేద విద్యార్థుల ఉన్నత చదువులకు లయన్స్‌క్లబ్ అండగా ఉంటుందని ఆమనగల్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లుగౌడ్ చెప్పారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో లయన్స్‌క్లబ్ ముందుంటుందని ఆయన చెప్పారు. జేఈఈ అడ్వాన్స్ పరీక్షలో ఆల్ ఇండియా మొదటి ర్యాంక్ సాధించిన చిద్విలాస్‌రెడ్డి, ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ పరీక్షలో 129వ ర్యాంక్ సాధించిన కొప్పుల బాలరాజుగౌడ్, వారి తల్లిదండ్రులను ఆమనగల్లు పట్టణంలోని లయన్స్ భవనంలో గురువారం క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. వెంకటేశ్వర్లుగౌడ్ మాట్లాడుతూ.. పట్టుదల, కృషి, ఏకాగ్రతతో ఏదైనా సాధించవచ్చని అన్నారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను సమకూరుస్తున్నట్లు చెప్పారు. ఉన్నత చదువులు చదివే విద్యార్థులకు లయన్స్‌క్లబ్ చేయూతనందిస్తుందని, గతంలో ఎందరో విద్యార్థుల ఉన్నత చదువులకు సాయం అందించామని గుర్తుచేశారు.ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జోన్ చైర్మన్ శేఖర్‌రెడ్డి, జిల్లా చైర్మన్ జూలురి రమేశ్, సభ్యులు గోవర్ధన్‌రెడ్డి, లింగయ్య, కసిరెడ్డి రాంరెడ్డి, గుజ్జరి నర్సింహ, యాదయ్యగౌడ్, గోపాల్‌రెడ్డి, పీఆర్ఓ పాషా తదితరులు పాల్గొన్నారు.

గుడిలో చోరీకి వెళ్లి చిక్కాడు

హస్తినాపురం: సాయిబాబా గుడిలో చోరీకి యత్నించిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ దేప జలేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట పట్టణం బర్లపెంట బజార్‌కు చెందిన షేక్ మన్సూర్(45) నగరంలో పెయింటర్‌గా పని చేస్తున్నాడు. జల్సాలకు అలవాటుపడ్డ ఇతను అవసరమైన డబ్బుల కోసం చోరీల బాట పట్టాడు. పోలీసస్టేషన్ పరిధిలోని ద్వారకామయినగర్ కాలనీలోని సాయిబాబా ఆలయంలో చోరీ చేసేందుకు గురువారం తెల్లవారుజామున మూడు గంటలకు ప్రవేశించాడు. గమనించిన స్థానికులు మన్సూర్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పోలీసుల విచారణలో చోరీ చేసేందుకు ఆలయంలోకి వెళ్లానని నిందితుడు ఒప్పుకున్నాడు. ఆలయ క్లర్క్ సూర్యనారాయణరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మన్సూర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. చోరీలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు.

డాక్యుమెంట్ పోయినది

రెడ్డి శివానంద్ రెడ్డి S/o రెడ్డి క్రిష్ణ కుమార్ రెడ్డి, సాగర్ రింగ్ రోడ్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా, కొంగరకలాన్‌లోని సర్వే నెం. 359/అ లో నా యొక్క 300 చ॥గ॥ల ప్లాట్ యొక్క ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ నెం. 2410/2014 నేను బొంగ్లూరు నుండి కొంగరకలాన్ బస్సులో వెళ్తుండగా దారిలో ఎక్కడో పడిపోయినది. దొరికినవారు క్రింది నెంబరులో తెలపగలరు. తగిన పారితోషికము ఇవ్వబడును.

సెల్ : 9701261321

మహిళలు స్వయం ఉపాధితో ఎదగాలి

సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా



శిక్షణ పొందుతున్న మహిళలతో వెంకటేశ్

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎస్‌వీఈపీ సౌజన్యంతో ఏర్పాటు చేసిన స్వీట్ తయారీ కేంద్రాన్ని గురువారం ఆమనగల్లు సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్తా సందర్శించారు. ఆమనగల్లులో ఇటీవల ఏర్పాటు చేసిన స్వీట్ తయారీ కేంద్రంలో మహిళలకు శిక్షణ ఇస్తున్నారు. స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదుగుతున్న మహిళలను గంప వెంకటేశ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కడ్తాల మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు వీరయ్య, ముద్విన్ ఉపసర్పంచ్ వినోద్, స్వీట్ తయారీ కేంద్రం నిర్వాహకులు, శిక్షకులు అరుణజ్యోతి, శశిరేఖ, నాగమణి, లావన్య, హిమబిందు, వినోద, నర్మద, భాగ్యలక్ష్మి, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

'ప్రధాని నరేంద్రమోదీ పాలనలో అద్భుత ప్రగతి'



గిరిజనులతో మాట్లాడుతున్న ఆచారి

ఆమనగల్లు: ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలనలో దేశం అద్భుత ప్రగతి సాధించిందని బీజేపీ సీనియర్ నేత ఆచారి అన్నారు. మాడ్గుల మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో గురువారం నిర్వహించిన మహాజన్ సంపర్క్ అభియాన్‌లో ఆచారి పాల్గొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనలో అనేక విజయాలు సాధించిందని చెప్పారు. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలు కేంద్రం అమలు చేస్తుందని చెప్పారు. కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. మండల బీజేపీ అధ్యక్షుడు పెద్దయ్య, నాయకులు వెంకటేశ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉపసర్పంచ్ అజీజ్‌పై చర్యలు తీసుకోండి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎంపీడీఓకు ఎమ్మార్పీఎస్ నేతల వినతి

తలకొండపల్లి: రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి మాదిగ కులాన్ని అవమానించే విధంగా మాట్లాడటం సరైందికాదని ఎమ్మార్పీఎస్, ఎమ్మార్పీఎస్ అనుబంద సంఘాల నాయకులు అన్నారు. ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేసిన వెల్జాల్ ఉప సర్పంచ్ అజీజ్‌ను పదవి నుంచి తొలగించాలని ఎంపీడీఓ శ్రీకాంత్‌కు గురువారం వారు వినతిపత్రం అందజేశారు. మాదిగ జాతిని అడుక్కొని తినేవాళ్లుగా అవమానించి మాట్లాడిన అజీజ్‌పై చర్యలు తీసుకోవాలని తలకొండపల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్‌లు కృష్ణ, కిరణ్, మండలాధ్యక్షుడు కిరణ్‌పూలే, ఎంఎస్ఎఫ్ మండలాధ్యక్షుడు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి అనిల్, విజయ్, గణేష్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



కడ్తాల్: జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం

దివంగత భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని గురువారం కల్వకుర్తి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లో నిర్వహించారు. పార్టీలకతీతంగా నాయకులు, ప్రజా సంఘాలు, అభిమానులు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. యువత జగ్జీవన్‌రామ్ బాటలో నడవాలన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



యాచారం: జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



తుర్కయంజాల్: నివాళి అర్పిస్తున్న జగ్జీవన్‌రామ్ ఉత్సవ కమిటీ సభ్యులు

గొర్రెల పంపిణీని వేగవంతం చేస్తాం

సంస్థ చైర్మన్ బాలరాజ్‌యాదవ్



డైరెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

తలకొండపల్లి: గొర్రెలు, మేకల పంపిణీని వేగవంతం చేస్తామని గొర్రెల మేకల అభివృద్ధి సమాఖ్య సంస్థ చైర్మన్ బాలరాజ్‌యాదవ్ అన్నారు. ఈ నెలాఖరులోగా పదివేల మందికి గొర్రెలను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని తెలిపారు. గొర్ల పంపిణీ ఆలస్యం కావడంతో గొర్రెల, మేకల పెంపకందార్ల సంఘం (జీఎంపీఎస్) ఆందోళన వ్యక్తం చేసింది. హైదరాబాద్‌లోని పశుసంవర్ధ శాఖ కార్యాలయాన్ని ఈనెల 12న ముట్టడించాలని నిర్ణయించింది. ఈ మేరకు 12న ముట్టడి వద్దని పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ రాంచందర్ జీఎంపీఎస్ నాయకులను చర్చలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని పడకల్‌కు చెందిన జీఎంపీఎస్ జిల్లా కార్యవర్గ సభ్యులు పెంటయ్యతో పాటు, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కిల్లె గోపాల్, ఉడుత రవీందర్ బుధవారం రాత్రి చర్చలకు వెళ్లారు.

వినతిపత్రం అందజేత..

గొర్రెల, మేకల అభివృద్ధి సమాఖ్య సంస్థ చైర్మన్ బాలరాజ్‌యాదవ్‌ను, పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ రాంచందర్‌ను హైదరాబాద్‌లో మాసాబ్‌ట్యాంక్‌లోని పశు సంవర్ధకశాఖ జేడీ కార్యాలయంలో కలిసి గొర్రెల కాపరులకు సంబంధించిన 10 డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను చైర్మన్, డైరెక్టర్‌కు అందజేశారు. గొర్ల పంపిణీలో దళారుల ప్రమేయం లేకుండా నగదు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. గొర్ల యూనిట్‌ల కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన గొర్ల కొనుగోలు కేంద్రాలను రద్దుచేయాలని కోరారు. డీడీలు చెల్లించిన లబ్ధిదారులందరికి గొర్రెలను పంపిణీ చేయాలని పట్టుబట్టారు. గొర్ల పంపిణీకి కుల ధ్రువీకరణ పత్రం అవసరం లేకుండా.. సొసైటీలు ఎంపిక చేసిన లబ్ధిదారులకు గొర్ల యూనిట్లను అందజేయాలని కోరారు. దీంతో డైరెక్టర్, చైర్మన్ మాట్లాడుతూ.. మీరు కోరిన డిమాండ్లను పరిశీలిస్తామన్నారు. ప్రమాదల్లో మరణించిన గొర్లకు బీమాను చెల్లించని కంపెనీలపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సంతృప్తి చెందిన జీఎంపీఎస్ నాయకులు 12న తలపెట్టిన ముట్టడి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జీఎంపీఎస్ రాష్ట్ర, జిల్లా నాయకులు గోపాల్, రవీందర్, పెంటయ్య, శంకరయ్య, మల్లేశఖ, లింగయ్య, కొమురయ్య, సురేష్, రాజు, మధుకర్ పాల్గొన్నారు.